

ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీలను వాయిదా వేయండి..!

● జేఎన్‌టీయూ వీసీకి వినతి



మాట్లాడుతున్న వీసీ నర్సింహారెడ్డి, వేదికపై రెక్టార్, రిజిస్ట్రార్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఫార్మసీ, ఎంఫార్మసీ గ్రాడ్యుయేట్లకు ఇండస్ట్రీల్లో డిమాండ్ ఎక్కువగా ఉన్నందున, తమ కళాశాలల్లో బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని పలు ఫార్మసీ కాలేజీల యాజమాన్య ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలతో జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొన్ని కళాశాలల ఛైర్మన్లు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. నిబంధనలకు అనుగుణంగా బోధనా సిబ్బందిని నియమించుకునేందుకు మరో రెండువారాల గడువు ఇవ్వాలని, నియామకాలు పూర్తయ్యే వరకు ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ(ఎఫ్‌ఎఫ్‌సీ) తనిఖీలను వాయిదా వేయాలని వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డికి విజ్ఞప్తి చేశారు. వీసీ మాట్లాడుతూ.. యాజమాన్యాల సూచనలను, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. సమావేశంలో యూనివర్సిటీ రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఆడిట్ సెల్ అధికారులు తారాకళ్యాణి, రవీంద్రరెడ్డి, ప్రసన్న పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటాం జడ్పీ ఛైర్‌పర్సన్ సునీతారెడ్డి



మాట్లాడుతున్న జడ్పీఛైర్‌పర్సన్ సునీతారెడ్డి

గచ్చిబౌలి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటామని వికారాబాద్ జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి నల్లగండ్లలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు సుమారు 500మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి సునీతారెడ్డి, జగదీశ్వర్‌గౌడ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గోకుల్‌ఫ్లాట్స్‌కు చెందిన టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు ప్రసాద్, మాదాపూర్ డివిజన్ టీడీపీ అధ్యక్షురాలు సువర్ణ, గోపన్‌పల్లి చంద్రమౌళి, నానక్‌రాంగూడ బీజేపీ నాయకుడు కైలాస్‌సింగ్, శంషిగూడకు చెందిన యువకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోరారు. కాంగ్రెస్‌కు సేవచేసిన కార్యకర్తలకు గతంలో అన్యాయం జరిగిందని, తాము పార్టీలో కొత్తగా చేరినపట్టికీ అందరికీ న్యాయం చేస్తామన్నారు. పది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో శేరిలింగంపల్లి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో భార్గవ్‌రెడ్డి, కోట్ల రజిత్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

వరదనీటి కాల్వతో ముంపు సమస్యకు పరిష్కారం: కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): గత వర్షాకాలంలో తలెత్తిన సమస్య పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. శుక్రారం ఆయన మియాపూర్ ఏఎస్‌రాజునగర్, మహోదాయ ఎన్‌క్లేవ్ కాలనీలో జరుగుతున్న వరదనీటి కాల్వ పనులు చేపట్టే ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లతరబడి వర్షాకాలంలో ముంపు సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారని వరదనీటి కాల్వ పనులు పూర్తయితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. డివిజన్‌లో ఎక్కడ ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ఇన్‌స్పెక్టర్ నవీన్, అన్వర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సమగ్ర అభివృద్ధి: మహేశ్వర్‌రెడ్డి

గచ్చిబౌలి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని బీజేపీ శాసనసభ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సంక్షేమం అంటేనే నరేంద్ర మోదీ..అభివృద్ధి అంటే బీజేపీ సర్కార్ అని తెలిపారు. శుక్రవారం విజయ సంకల్పయాత్ర శేరిలింగంపల్లి నియోజకవర్గం నానక్‌రాంగూడ నుంచి మియాపూర్ ఆల్విన్‌కాలనీ చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహించారు. అనంతరం మియాపూర్ ఆల్విన్‌కాలనీలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాజీఎంపీ కొండా విశ్వేశ్వరెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జీ మల్లారెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ రాఘవేందర్‌రావు, రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నరేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న విజయసంకల్పయాత్రలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా ఐదు దఫాలుగా యాత్రలు జరుగుతున్నాయన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకుని మోదీ హ్యాట్రిక్ సాధించి ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణాలో అత్యధిక ఎంపీ సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి ఆర్థిక సాయం

గాజులరామారం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని సంస్కృతి ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న రాజేష్ కుమార్తె సంహిత (10) బ్లడ్ కేన్సర్‌తో బాధ పడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి ఆర్థిక సాయంగా రూ. 25 వేల చెక్కును తన కూతురు హేమశ్రీ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఎప్పుడూ తోడుంటానన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ బీ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సొంటిరెడ్డి చైతన్య, వెంకటరామిరెడ్డి, రాజారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వాయుకాలుష్యంతో సోరియాసిస్ కేసులు

హైదరాబాద్ సిటీ: నగరాల్లో వాయుకాలుష్యం వల్ల సోరియాసిస్ కేసులు పెరుగుతున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైటెక్స్‌లో శుక్రవారం డెర్మకాన్ 2024 సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ రుమటాలజిస్టులు, చర్మవ్యాధి నిపుణులు హాజరయ్యారు. ఒత్తిడి, నిద్రలేకపోవడం వ్యాధిపై ప్రభావం చూపుతుందన్నారు. స్కిన్ సాగా డైరెక్టర్ డాక్టర్ అసీమ్ శర్మ మాట్లాడుతూ.. ఒత్తిడి శ్వాసకోశ వ్యవస్థను మాత్రమే కాకుండా చర్మ సంబంధిత వ్యాధులను కూడా ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. అడ్వాన్స్‌డ్ స్కిన్ హెయిర్ లేజర్ క్లినిక్ డెర్మటాలజిస్టు డాక్టర్ ఎస్.కిరణ్ మాట్లాడుతూ.. సోరియాసిస్‌తో చర్మంపై ఎరుపు లేదా తెలుపు రంగులో మచ్చలు వస్తాయని, ఇది ఒక ఆటో-ఇమ్యూన్ వ్యాధి అని, విస్మరిస్తే సోరియాటిక్ ఆర్థరైటిస్‌కి దారితీస్తుందన్నారు. దేశంలో ఏటా సుమారు 10 మిలియన్ల సోరియాసిస్ కేసులు నమోదవుతున్నాయన్నారు. డాక్టర్ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కాంతి చికిత్స, నోటి మందులు, బయోలాజికల్ థెరపీ వంటి అనేక ప్రభావవంతమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



పోలీసులు విధించిన చలానా

వాహనం తయారు కాకముందే చలానా

● కొనుగోలు 2023లో.. జరిమానా 2020లో..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వాహనం తయారు కాకముందే నిబంధనల ఉల్లంఘన పేరిట చలానా వేశారు. ఇది ట్రాఫిక్ పోలీసుల అతి తెలివికి పరాకాష్టగా మారింది. 2023 డిసెంబర్ 22న ఓ వ్యక్తి వాహనం కొనుగోలు చేశాడు. 2024 జనవరి 6న రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. 2020 డిసెంబర్ 14న నిబంధనలు ఉల్లంఘించినట్లు ట్రాఫిక్ పోలీసులు చలానా వేశారు. నంబర్ ప్లేట్ సక్రమంగా లేదని సంగారెడ్డి ట్రాఫిక్ పోలీసులు చలానా విధించి ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశారు..మూడేళ్ల క్రితం వాహనం, నంబర్ ఎక్కడ ఉందని వాహనదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కారు యజమాని స్నేహితుడు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ట్రాఫిక్ పోలీసుల పనితీరుకు అద్దం పడుతున్న ఈ సంఘటనపై అధికారులు ఏం సమాధానం చెబుతారో చూడాలి.

పంజాబ్ రైతులపై పోలీసుల దాడికి నిరసన

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పంజాబ్ రైతులపై హరియాణా పోలీసుల దాడిని ఖండించాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయం దగ్గర బీజేపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియ జేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ హరియాణా, పంజాబ్ సరిహద్దుల్లో పోలీసులు జరిపిన కాల్పుల్లో పంజాబ్ రాష్ట్రం, బడింట జిల్లా, బాలన్ గ్రామానికి చెందిన 24 సంవత్సరాల యువ రైతు శుభకరణ్ సింగ్ మరణించాడని, ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కాల్పుల ఘటనపై సుప్రీమ్ కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దేవదానం, శ్రీనివాస్, తిమ్మప్ప, వీరేష్, భాషా, నర్సింహులు, సాదులు, మల్లారెడ్డి, కరుణాకర్ సురేష్, సరస్వతి పాల్గొన్నారు.

నిజాంపేట్: భారత రైతాంగం న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సాగిస్తున్న పోరాటంపై మోదీ ప్రభుత్వం శత్రు సంహారం చేస్తున్న రీతిగా యువ రైతును హత మార్చిందని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం చంద్రశేఖర్ అన్నారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, హరియాణా ప్రభుత్వం యువ రైతు శుభకరణ్ సింగ్‌ను పంజాబ్ బోర్డర్‌లో హత్య చేయడానికి నిరసనగా శుక్రవారం బ్లాక్ డేగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్ సీఐటీయూ ఆటో స్టాండ్ వద్ద బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలాపీర్, బ్రహ్మానందం, కృష్ణారావు, మహేష్‌రెడ్డి, బాబు నాయక్ పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ కూల్చేసి..

రూ. 4 కోట్ల స్థలం కబ్జాకు యత్నం



గాంధీనగర్ ఫేజ్-2లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ (ఫైల్)

బాలానగర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అది బాలానగర్ కో ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు చెందిన స్థలం. అక్కడ కూల్చివేతలు, నిర్మాణాలు చేపట్టాలంటే బోర్డు మీటింగ్‌లో చర్చించాలి. ఆ తరువాతే అసలు పనులు మొదలు పెట్టాలి. కానీ మీటింగ్‌లో చర్చించకుండా 400 గజాల స్థలంలో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను కూల్చి వేశారు. బాలానగర్ కో ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఫేజ్-2 గాంధీనగర్ పారిశ్రామిక వాడలో చేపట్టిన ఈ కూల్చివేతపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతే కాకుండా వాటర్ ట్యాంక్‌ను కూల్చగా వచ్చిన స్టీల్‌ను (సుమారు రూ. 6లక్షలు) గుట్టు చప్పుడు కాకుండా స్వాహా చేసి పంచుకున్నారని సీఐకీకి చెందిన సభ్యులు కొందరు తమ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు, గాంధీనగర్ పారిశ్రామిక వాడకు నీటిని సరఫరా చేసేందుకు 50 ఏళ్ల క్రితం400 గజాల స్థలంలో ట్యాంక్‌ను నిర్మించారని ప్రస్తుతం ఈ స్థలం విలువ సుమారు రూ. 4కోట్లు పైనే ఉంటుందని, అందుకే అక్రమార్కులు కన్ను ట్యాంక్ స్థలంపై పడిందని సీఐఈ డైరక్టర్లు మండి పడుతున్నారు.

కూల్చి వేయాలంటే నిబంధనలు ఇవీ..

బాలానగర్ కో ఆపరేటివ్ సొసైటీలోని ఫేజ్ 1, 2, 3లోని కామన్ ఎమినిటీస్‌లో ఏమైన కట్టాలన్న కూల్చాలన్న సొసైటీ బోర్డు, జనరల్ బాడీ తీర్మానించిన తరువాత టెండర్ ద్వార పనులు చేపట్టాలి. కానీ ఈ నిబంధనలేవీ పాటించకుండా ట్యాంకు కూల్చివేత జరిగినట్లు స్వయాన సొసైటీ సభ్యులే ఆరోపించడం గమనార్హం.

సీఐఈ చైర్మన్ పొంతన లేని సమాధానాలు..

ట్యాంక్ కూల్చివేతపై బాలానగర్ సీఐఈ చైర్మన్ బధృద్దీన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తనకు గానీ బోర్డు సభ్యులకు గానీ ఎలాంటి సమాచారం లేదని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. కూల్చివేతలకు ముందు ట్యాంక్ వద్ద సీఐఈ సీనియర్ డైరక్టర్ శివకుమార్ తాయల్, ఐలా చైర్మన్ రాజం, పారిశ్రామిక వేత్త ఎస్.ఏ. అఖిల్(హైదరాబాద్ కెమికల్ ఇండస్ట్రీస్) పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తుంటే చైర్మన్ ఆ వీడియోలు చూసి కూడా తనకేం తెలియదని చెప్పడంపై కొంతమంది బోర్డు డైరక్టర్లు బోర్డు మీటింగ్‌లో అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సీఐఈ ఫేజ్-2కు చెందిన కొందరు సభ్యులు కుమ్మక్కై కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాన్ని మింగేయాలని చూస్తున్నట్లుగా కొందరు సీఐఈ డైరక్టర్లు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ట్యాంక్ కూల్చివేతపై డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్ (డీసీవో) శ్రీనివాసరావు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.



ట్యాంక్ పూర్తిగా కూల్చేసిన తరువాత దృశ్యం

స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారు: భరత్‌వీర్, సీఐఈ వైస్ చైర్మన్, బాలానగర్



400 గజాల స్థలంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను బోర్డులో ఉన్న కొందరు వ్యక్తులు మరికొందరితో కుమ్మక్కై స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్యాంక్ కూల్చివేతపై సొసైటీ బోర్డుకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు, గతంలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై డీసీవోకు ఫిర్యాదు చేశాం. ఆయన పట్టించుకోలేదు. దీన్ని అలుసుగా తీసుకుని కొందరు సొసైటీని తమ ఇష్టారాజ్యంగా నడుపుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. బోర్డు మీటింగ్‌లో కూల్చివేత విషయం చర్చించి సదరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

బీఆర్‌ఎస్ పాలనలో చెరువులు, నాలాలు అన్యాక్రాంతం: బండి రమేష్

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పాలనలో కూకట్‌పల్లిలోని చెరువులు, నాలాలు అన్యాక్రాంతమయ్యాయని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఆరోపించారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలో ఆక్రమణకు గురైన రంగధాముని చెరువు, నాలాను ఆయన శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. గత పాలకుల అండదండలతో చెరువును ఆక్రమించుకొని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. ఫలితంగా వర్షాకాలంలో నాలా పొంగి మూసాపేట ప్రాంతంలోని బస్తీలు, కాలనీలను ముంచెత్తడంతోపాటు కూకట్‌పల్లి డిపో వద్ద జాతీయ రహదారిపై వరదనీరు పెద్దఎత్తున నిలిచిపోతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. చెరువులు, నాలాలు కబ్జా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు వాటి పరిరక్షణకు కృషి చేస్తామని బండి రమేష్ తెలిపారు. చెరువు, నాలాను కాపాడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, అధికారులు, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఏ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, బి బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కృష్ణరాజ్‌పుత్, సతీష్, దినేష్, సాధు ప్రతాప్‌రెడ్డి, రఘు, సునీల్‌యాదవ్, పుష్పారెడ్డి, రేష్మ, కృష్ణవేణి, జ్యోతి, కల్పన పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

వివేకానందనగర్‌కాలనీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రాంతంలో తరచూ నెలకొంటున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు, ట్రాఫిక్ ఎస్సైలతో ఎమ్మెల్యే శుక్రవారం సప్తగిరికాలనీలోని తన నివాసములో సమావేశం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో భారీగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు సంజీవరెడ్డి, కాశీనాథ్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పిద్దాం

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మన ఎదుగుదలకు ఎంతో మంది తోడ్పాటును అందించారు.. మనం సంపాదించిన జ్ఞానం, సంపదలో ఎంతో కొంత సమాజానికి ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పడిశెట్టి కృష్ణ పిలుపు నిచ్చారు. కేపీహెచ్‌బీలోని మంజీరా ట్రినిటీ కార్పొరేట్‌లో బ్రైట్ చైల్డ్ వెబ్‌సైట్‌ను సినీ నటుడు మనవ కోటేశ్వరరావు హాజరై ప్రారంభించారు. ఆశిష్ గాంధీ, శివప్రసాద్, కలయాంజి గోగన, రాగిరెడ్డి మంగారెడ్డి, విశ్వనాథం గుప్త అతిథులుగా హాజరై పేద పిల్లలకు విద్య, సమాజంలో వారి ఎదుగుదలకు కావాల్సిన అంశాలను బ్రైట్ చైల్డ్ సంస్థ తీర్చేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు.. ఆచరణలో చూపించేందుకు ప్రతి శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేసేందుకు ముందుకు వచ్చిన వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో బీసీఎఫ్ మేనేజర్ కనక లామ్ పాల్గొన్నారు.

దీనదయాల్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన

ఫతేనగర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ పరిధి దీనదయాల్ నగర్‌లో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ సతీష్‌గౌడ్ అన్నారు. రూ. 25 లక్షలతో దీనదయాల్‌నగర్‌లో చేపడుతున్న వర్షపు నీటి కాలువల నిర్మాణ పనుల నిమిత్తం బస్తీలో పర్యటించి నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ రామ్‌నారాయణ తెలిపిన వివరాలు.. మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట్ మండలం, దేవరాంజల్ గ్రామానికి చెందిన తాడికొండ శేఖర్ (37) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఉదయం బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు శేఖర్‌ను కిందికి దించి సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు.

వరుస దొంగతనాలతో కాలనీ వాసుల భయాందోళన

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వరుస దొంగతనాలతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. బాధితుల తెలిపిన వివరాలు... సుభాష్‌నగర్‌లోని బుధవారం పోచమ్మ ఆలయంలో దొంగలు పడి అమ్మవారి నగలు ఎత్తుకెళ్లిన ఘటన మరువక ముందే గురువారం రాత్రి సుభాష్‌నగర్ చివరి బస్సు స్టాప్‌లోని లక్ష్మీగణపతి కిరాణా, జనరల్ స్టోర్‌లో షెట్టర్‌ను పగులగొట్టి గల్లాలో ఉంచిన రూ. 1 లక్షా 50 వేలను దోచుకెళ్లారు. అదే విధంగా హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో నూతనంగా నిర్మించిన ఇంటికి ఉన్న వైరును దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీటలు వారిన గాంధీ ఆస్పత్రి చూస్తే బాధేస్తోంది : మంత్రి కోమటిరెడ్డి

అడ్డగుట్ట: గాంధీ ఆస్పత్రి పరిస్థితి చూస్తే బాధేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే లాస్య నందిత మరణ వార్త తెలుసుకొని గాంధీ ఆస్పత్రికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. బీటలు వారిన ఆస్పత్రి గోడలు, డ్రైనేజీ లీకేజీ చూస్తే రోగులు ఎంత ఇబ్బందులు పడుతున్నారో తెలుస్తుందన్నారు. అవసరమైతే గాంధీ ఆస్పత్రి మరమ్మతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉస్మానియా ఆస్పత్రిని బాగు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.



మాట్లాడుతున్న వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి

నగరానికి అదనపు జలాలు

- ఎమర్జెన్సీ పంపింగ్‌నకు ఏర్పాట్లు
- డిమాండ్‌ను బట్టి అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు
- వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగర అవసరాలకు అనుగుణంగా అదనపు జలాలను తరలించడానికి ఎమర్జెన్సీ పంపింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నామని వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని డిమాండ్‌ను అంచనా వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. జీహెచ్‌ఎంసీతో పాటు ఓఆర్ఆర్ పరిధిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దని, సూక్ష్మస్థాయి ప్రణాళికలు రచించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ఖైరతాబాద్‌లో వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరా, ఇతర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. రాబోయే ఐదు నెలలకు తాగునీరు సరఫరా చేసేందుకు క్షేత్రస్థాయిలో మైక్రో లెవల్ ప్లాన్స్ రూపొందించుకోవాలని, ఆయా ప్రాంతాలకు కేటాయించే నీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. నీటి సరఫరాలో సమయపాలన పాటించాలని, ఏవైనా ఇబ్బందులుంటే ముందుగా ప్రజలకు సమాచారమివ్వాలని సూచించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి నీటి కొరత, లోప్రెషర్ సమస్యలపై వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పరిష్కారానికి ప్రత్యేక బృందాలను సీజీఎంల ఆధ్వర్యంలో ఏర్పాటుచేయాలని, విద్యుత్ కోత ఉంటే.. ఇతర సమయాల్లో నీటి సరఫరా చేయాలన్నారు. చేతి పంపులు, బోర్‌వెల్స్ నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయిలో లైన్‌మెన్లు గైర్హాజరైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలుషిత నీటి సరఫరా, లీకేజీలు జరిగితే 24 గంటల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా సమయాల్లో కొంతమంది మోటార్లతో నీటిని తోడుతున్న ప్రాంతాల్లో లో ప్రెషర్ సమస్యలు వస్తున్నాయని.. వీటిని నివారించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ, డైరెక్టర్లు అజ్మీరా కృష్ణ, వీఎల్.ప్రవీణ్ కుమార్, స్వామి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జ్ఞానేందర్ రెడ్డి, జీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం!

సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ



మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

రాంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాపక్షపాతి, విప్లవ శ్రేయోభిలాషి అరికట్ల రామకృష్ణారెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం రామకృష్ణారెడ్డి సంతాపసభ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనురాధ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి గౌని బాలయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి భాస్కర్, విరసం నాయకురాలు విమల, సామాజిక విశ్లేషకులు కాకర్ల సజయ, ఓయూ ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, ప్రొఫెసర్ కాశీం, ప్రొఫెసర్ సమున్నత, రామకృష్ణారెడ్డి సోదరి జానకి, రామకృష్ణారెడ్డి జీవిత సహచరి, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ ఈ.సంధ్య, ప్రజా రచయిత జీవన్ తదితరులు రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామకృష్ణారెడ్డి చిన్నతనం నుంచే ప్రజా విప్లవ నాయకత్వ లక్షణాలు అలవర్చుకొని విప్లవ విద్యార్థి సంఘాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ విప్లవ రాజకీయాల వైపు దృఢంగా నిలబడ్డారని తెలిపారు. ఆయన మరణం ప్రగతిశీల, ప్రజాస్వామిక, సామాజిక, విప్లవోద్యమాలకు తీరని లోటుగా పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల పక్షపాతిగా, విప్లవ శ్రేయోభిలాషిగా, ప్రెస్ నిర్వాహకుడిగా, ఉత్తమ పబ్లిషర్‌గా రామకృష్ణారెడ్డి చేసిన కృషి, సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు.

భద్రతా పరంగా చూడాల్సిన అంశాలు..

(3వ పేజీ తరువాయి)

వంటివి ప్రతి చక్రమూ తగినంత ఫోర్స్ పొందేలా చేస్తాయి.

ఈడీఎల్ (ఎలక్ట్రానిక్ డిఫరెన్షియల్ లాక్): స్టెబిలిటీ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్‌తోపాటుగా ఎలక్ట్రానిక్ డిఫరెన్షియల్ లాక్(ఈడీఎల్) పనిచేస్తుంది. మలుపుల వేళ కారు రోడ్డుపై పట్టుకోల్పోకుండా అడ్డుకోవడంలో ఇది తోడ్పడుతుంది.

టీపీఎంఎస్: టైర్ ప్రెజర్ మానిటర్ సిస్టమ్(టీపీఎంఎస్)గా చెబుతుంటారు. దీనితో రియల్ టైమ్‌లో టైర్ ప్రెషర్ ఎంత ఉందో తెలుస్తుంది. ఒక టైర్‌లో ప్రెషర్ తగ్గినా హెచ్చరిక ఇస్తుంది. ప్రమాదాలు జరగకుండా నివారించడంలో టీపీఎంఎస్ పాత్ర కీలకమని, టైర్ ప్రెషర్ సరిగా లేకపోతే వాహన నియంత్రణ కష్టమని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

ఈఎస్‌సీ: కారుపై నియంత్రణ కోల్పోయినప్పుడు స్టెబిలైజ్ చేయడంలో ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఈఎస్‌సీ) తోడ్పడుతుంది.

ఇవిగాక రియర్ కెమెరాలు, మల్టీ కొలిజన్ బ్రేకింగ్, హిల్ డీసెంట్ కంట్రోల్, డ్రైవర్ నీ ఎయిర్‌బ్యాగ్ వంటివి భద్రత పరంగా తోడ్పడతాయి.

మద్యం తాగితే ప్రాణ ముప్పు ఎక్కువ



మద్యం తాగిన వారు ప్రమాదాలకు గురైతే వారికి ప్రాణముప్పు అధికంగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా వెన్ను, ఎముకలు, తలకు సంబంధించిన గాయాలే ఉంటాయి. తలకు బలమైన దెబ్బ తగిలితే పరిస్థితి ప్రమాదకరంగా ఉంటుంది. ఎక్కువగా మద్యం తాగి డ్రైవింగ్ చేసిన వారు ప్రమాదానికి గురైతే వారికి మెదడు, వెన్నుపై ఆల్కహాల్ తీవ్ర ప్రభావం చూపుతుంది. కింద పడినప్పుడు బ్రైన్‌కు ఎక్కువ గాయాలయ్యే ముప్పు ఉంటుంది. మద్యం వల్ల గుండె స్పందనలు, బీపీ పెరిగి హార్ట్ ఫెయిల్యూర్ అయ్యే ప్రమాదముంది. కడుపునొప్పి, రక్తపు వాంతులు జరిగే అవకాశముంది. అతి మద్యం వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశముంది.

- డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, న్యూరో, స్పైన్ సర్జన్, మెడికవర్ ఆస్పత్రి

అంతలోనే..

(3వ పేజీ తరువాయి)

చేతిలో ఓటమి పాలయ్యారు. అనారోగ్యంతో గతేడాది మరణించడంతో ఆయన కుటుంబం నుంచే సాయన్న రాజకీయ వారసురాలిగా ఉన్న లాస్యనందిత ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. అంతకుముందు కవాడిగూడ కార్పొరేటర్‌గా ఉన్న లాస్య.. తండ్రి తరహాలోనే ప్రజల్లో ఉండేవారు. సమస్య ఉందని తన వద్దకు ఎవరు వెళ్లినా పరిష్కారానికి ప్రయత్నం చేసేవారు. ఏదైనా కార్యక్రమం ఉందని ఆహ్వానించినా తప్పకుండా హాజరయ్యేవారని ప్రజలు చెబుతున్నారు. లాస్య కవాడిగూడ నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికై తొలిసారిగా రాజకీయాల్లోకి వచ్చారు. డివిజన్ అభివృద్ధికి ఆమె తన వంతు కృషి చేశారు. 2020 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో రెండోసారి కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆమె పరాజయం పాలయ్యారు. తండ్రి మరణంతో అవకాశం దక్కడంతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. కంటోన్మెంట్, ముషీరాబాద్ నియోజకవర్గాల ప్రజలతో సాయన్న కుటుంబం, లాస్యనందితకు ప్రత్యేక అనుబంధం ఉంది. లాస్య మృతిపై నగరంలోని పలువురు ఎమ్మెల్యేలు సంతాపం ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మొదటి ఎమ్మెల్యే..

నగర రాజకీయ చరిత్రలో రోడ్డు ప్రమాదం బారిన పడి మృతిచెందిన తొలి ఎమ్మెల్యే లాస్యనందిత కావడం అన్ని వర్గాల ప్రజలను కలిచి వేసింది. సాయన్న వారసురాలిగా, ఆయన ఆశయాలను నెరవేర్చే క్రమంలో, అర్థాంతరంగా ఆమె తనువు చాలించడం విచారకరమని పలువురు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

గాజులరామారం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో నాయకులు చేరుతున్నారని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్, దేవేందర్ నగర్‌లోని మైనార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 2 వందల మంది హన్మంత్ రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమలు చేసిందని, మార్చి నెలలో మరో రెండు అమలు అవుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

చెరువు ఎఫ్‌టీఎల్‌లో కళాశాలల నిర్మాణాలు

గుర్తించిన అధికారులు ● కూల్చివేతల జోలికి వెళ్లని వైనం

మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్



దుండిగల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏరోనాటికల్, ఎంఎల్ఆర్ఐటీఎం అండ్ ఫార్మసీ కళాశాలలకు చెందిన షెడ్లు, కొన్ని బిల్డింగ్‌లు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోనే ఉన్నాయని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నివేదిక ఇచ్చారు. నిర్మాణాలను తొలగించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ మూడు రోజుల క్రితం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెండు రోజులుగా ఒక షెడ్డును మాత్రమే కూల్చివేశారు. ఎఫ్‌టీఎల్‌లో వేసిన రోడ్డును తవ్వి మట్టిని తరలించే కార్యక్రమం కొనసాగిస్తున్నారు. రెండు కాలేజీలకు సంబంధించిన క్యాంటీన్‌లు, పార్కింగ్ స్థలాలు, షెడ్లను అధికారులు శుక్రవారం కూడా ముట్టుకోలేదు. ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి మార్కింగ్ చేశారు. ఆ ప్రాంతంలో నిర్మాణాలు ఉన్నట్లు తేల్చారు. కాని వాటిని ఎందుకు కూల్చడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. శుక్రవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వచ్చి చూసి వెళ్లారు. మున్సిపల్ కమిషనర్ దగ్గరుండి సిబ్బందితో మట్టి తరలించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే అధీనంలో ఈ కళాశాలలు 20 ఏళ్ల నుంచి కొనసాగుతున్నాయి. చెరువును కొంతభాగం పూడ్చి శిఖం భూముల్లో బస్సులు పార్కింగ్ చేస్తున్నారు. నోటీసులిచ్చి భవనాలు కూల్చివేస్తామని అధికారులు చెబుతున్నారు.



ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలు